

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 301 | ఎడిటర్ : బరిగెల శివ | శనివారం 03, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్







# గ్రామ సేవలు.. గాడి తప్పుతున్నాయి !

డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్





గ్రామస్థాయిలో ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు గాడి తప్పుతున్నాయని డాక్టర్ బరిగెల శివ అన్నారు. పంచాయతీ నిధుల వినియోగం, అభివృద్ధి పనులు, ప్రజాసేవలపై వస్తున్న ఫిర్యాదులపై అధికారులు దృష్టి సారించాలని కోరారు. విలేజ్ సెక్రటరీలు, విలేజ్ అసిస్టెంట్ల పనితీరుపై ప్రజల్లో ఉన్న అసంతృప్తిని పరిశీలించాలని సూచించారు. ఇళ్ల నిర్మాణ అనుమతులు, ఇతర సేవల విషయంలో అనధికార వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలపై క్షేత్రస్థాయి విచారణ చేపట్టాలని అన్నారు. పంచాయతీ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటిస్తూ అంచనాలు, వర్క్ ఆర్డర్లు, ఖర్చులు, బిల్లుల వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరారు. రోడ్లు, డ్రైనేజీలు, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర అభివృద్ధి పనుల నాణ్యతను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పేర్కొన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సిబ్బంది హాజరు, రికార్డులు, నిధుల వినియోగాన్ని పరిశీలించాలని సూచించారు. గ్రామాల్లో అవినీతి, నిధుల దుర్వినియోగం, కాంట్రాక్టు పనుల్లో అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తేవాలని డిమాండ్ చేశారు. - హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

ఎక్కువ శాతం నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయి

విలేజ్ సెక్రటరీలు విలేజ్ అసిస్టెంట్‌లు ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారు

ఇండ్ల నిర్మాణ అనుమతుల్లో జనాలను డబ్బుల కోసం పీక్కుతింటున్నారు

ప్రజాసేవలపై కాస్తయినా పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు

గ్రామపంచాయతీ నాయకుల దౌర్జన్యాలను భరించలేకపోతున్న ప్రజలు

పంచాయతీలు సెటిల్మెంట్లు దందాలతో గ్రామస్థాయి అభివృద్ధి కుంటుపడుతుంది

ఆదర్శవంతమైన సేవలను అక్కరకు రాకుండా చేస్తున్నారు

ప్రజలను దబాయిస్తూ  పుఖ్యానికి ఓట్లు వేశారా అంటూ బెదిరిస్తున్నారు

ఐదు సంవత్సరాల కాలంలో పెట్టిన పెట్టుబడికి 5దు ఇంతలు సంపాదించాల్సిందేనా

గ్రామస్థాయి పాలన అభివృద్ధిపై పట్టింపు లేని ఉన్నతాధికారులు

కాంట్రాక్టు పనుల్లో యమదోపిడి జరుగుతుంది

అభివృద్ధి అంతా అర్బన్ పరిధికేనా గ్రామస్థాయి పరిస్థితి ఏమైపోవాలి : డాక్టర్ బరిగెల శివ

2

# పాఠశాలల్లో అల్పాహార పథకం

**డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా పథకం ప్రారంభం**

**సెంట్రలైజ్డ్ కిచెన్ల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌తో ఒప్పందాలు**

**నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లలో వంటశాలల కోసం ప్రైవేటు సంస్థల ముందడుగు**

**నవంబర్ 30 కల్లా ఏర్పాట్లు పూర్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశం**

**ఆహార నాణ్యత పర్యవేక్షణకు కమాండ్ కంట్రోల్ సెంటర్ ఏర్పాటు**

హైద్రాబాద్, అక్టోబర్ 2 (జై భీమ్ న్యూస్)

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం అమలు చేయనున్న అల్పాహార పథకం ఏర్పాట్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేగవంతం చేశారు. డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని ప్రారంభించేందుకు వీలుగా నవంబర్ 30 నాటికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పథకంలో భాగంగా సెంట్రలైజ్డ్ కమ్యూనిటీ కిచెన్ల ఏర్పాటుకు సంబంధించిన ఒప్పందాలు నేడు ముఖ్యమంత్రి సమక్షంలో జరిగాయి. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో అత్యాధునిక వంటశాలల ఏర్పాటుకు హరేకృష్ణ ఫౌండేషన్‌కు మద్దతుగా జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు ముందుకొచ్చాయి. నాగర్‌కర్నూల్‌లో కిచెన్ ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ తరఫున సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు రూ.5.17 కోట్ల చెక్కును, వికారాబాద్‌లో కిచెన్ ఏర్పాటుకు చైన్ ల్యాబ్స్ ఇండియా తరఫున ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ రూ.4 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరేకృష్ణ ఫౌండేషన్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులకు అందించే ఆహారంలో కేలరీలను లెక్కించేందుకు ప్రత్యేక యాప్‌లను వినియోగించాలని సూచించారు. స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా మెనూ ఉండాలని, ఆహార నాణ్యతను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం దీర్ఘకాలం కొనసాగేలా సెంట్రల్ కిచెన్లను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించాలని ఆదేశించారు. విద్యార్థుల్లో పోషకాహార విలువలను పెంచి, హాజరుశాతాన్ని మెరుగుపరచడమే ఈ పథకం ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరేకృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్రదాస్ స్వామీజీ తదితరులు పాల్గొన్నారు.



## బాపూఘాట్‌లో గాంధీజీకి

# ఘన నివాళులు





**డిజిటల్ మ్యూజియం ప్రారంభం**

హైద్రాబాద్, 2 అక్టోబర్ 2026(జై భీమ్ న్యూస్)

జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్‌లో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి కలిసి మహాత్మా గాంధీకి ఘన నివాళులు అర్పించారు. గాంధీజీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి, అనంతరం నిర్వహించిన సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాపూఘాట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డిజిటల్ మ్యూజియంను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మహాత్మా గాంధీ జీవితం, ఆయన సిద్ధాంతాలు, స్వాతంత్ర్య ఉద్యమంలో చేసిన కృషిని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రజలకు, ముఖ్యంగా యువతకు చేరువ చేసేలా డిజిటల్ మ్యూజియాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, మహమ్మద్ అజారుద్దీన్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షురాలు గద్వాల విజయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ సలహాదారులు వి. హనుమంత రావు, హర్కర వేణుగోపాల్, ప్రభుత్వ విప్‌లు అద్దంకి దయాకర్, రామచంద్ర నాయక్, ఎమ్మెల్సీ, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇతర అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ చూపిన సత్యం, అహింస, శాంతి, సమానత్వం, స్వచ్ఛత వంటి విలువలను స్మరించుకున్నారు. గాంధీజీ ఆశయాలను ప్రజలందరూ ఆచరణలో పెట్టాలని కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు, అధికారులు పిలుపునిచ్చారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE

# గ్రామ "సేవలు" గాడి తప్పుతున్నాయి

**ఎక్కువ శాతం నిధులు దుర్వినియోగం జరుగుతున్నాయి**
**విలేజ్ సెక్రటరీలు విలేజ్ అసిస్టెంట్ లు ఇష్టారాజ్యాంగ వ్యవహరిస్తున్నారు**
**ఇండ్ల నిర్మాణ అనుమతుల్లో జనాలను డబ్బుల కోసం పీక్కుతింటున్నారు**
**ప్రజాసేవలపై కాస్తయినా పట్టింపు లేకుండా వ్యవహరిస్తున్నారు**
**గ్రామపంచాయతీ నాయకుల దౌర్జన్యాలను భరించలేకపోతున్న ప్రజలు**
**పంచాయతీలు సెటిల్మెంట్లు దందాలతో గ్రామస్థాయి అభివృద్ధి కుంటుపడుతుంది**
**ఆదర్శవంతమైన సేవలను అక్కరకు రాకుండా చేస్తున్నారు**
**ప్రజలను దబాయిస్తూ పుఖ్యానికి ఓట్లు వేశారా అంటూ బెదిరిస్తున్నారు**
**ఐదు సంవత్సరాల కాలంలో పెట్టిన పెట్టుబడికి 5దు ఇంతలు సంపాదించాల్సిందేనా**
**గ్రామస్థాయి పాలన అభివృద్ధిపై పట్టింపు లేని ఉన్నతాధికారులు**
**కాంట్రాక్టు పనుల్లో యమదోపిడి జరుగుతుంది**
**అభివృద్ధి అంతా అర్బన్ పరిధికేనా గ్రామస్థాయి పరిస్థితి ఏమైపోవాలి**
**డాక్టర్ బరిగెల శివ**



**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

గ్రామస్థాయిలో ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు గాడి తప్పుతున్నాయని, గ్రామపంచాయతీల్లో అభివృద్ధి కోసం కేటాయిస్తున్న నిధుల వినియోగంపై అనేక అనుమానాలు, ఆరోపణలు వ్యక్తమవుతున్నాయని డాక్టర్ బరిగెల శివ అన్నారు. గ్రామీణ ప్రజలకు ప్రభుత్వ సేవలు సులభంగా, పారదర్శకంగా అందాల్సి ఉండగా, కొన్నిచోట్ల అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా విలేజ్ సెక్రటరీలు, విలేజ్ అసిస్టెంట్ల పనితీరుపై ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, చిన్నచిన్న పనుల కోసం కూడా ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రజాసేవలపై కనీస పట్టింపు లేకుండా వ్యవహరించే అధికారుల తీరుతో గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. గ్రామాల్లో ఇళ్ల నిర్మాణ అనుమతుల విషయంలో కూడా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని డాక్టర్ బరిగెల శివ తెలిపారు. నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి సకాలంలో అనుమతులు ఇవ్వాల్సి ఉండగా, వివిధ కారణాలతో దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచి డబ్బుల కోసం ప్రజలను ఇబ్బంది పెడుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఇలాంటి ఆరోపణలపై సంబంధిత ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి వాస్తవాలను బయటకు తీయాలని కోరారు.
గ్రామపంచాయతీలకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులు ప్రజల మౌలిక అవసరాలు, గ్రామాల అభివృద్ధి కోసం వినియోగించాల్సి ఉండగా, వాటి వినియోగంలో పారదర్శకత లోపిస్తే ప్రజాధనానికి నష్టం జరుగుతుందని ఆయన అన్నారు. గ్రామాల్లో చేపట్టిన ప్రతి అభివృద్ధి పనికి సంబంధించిన అంచనాలు, మంజూరు వివరాలు, వర్క్ ఆర్డర్లు, పనుల పురోగతి, ఖర్చు చేసిన నిధులు, కాంట్రాక్టర్ల వివరాలు, బిల్లుల చెల్లింపులు తదితర వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. నిధుల దుర్వినియోగంపై అనుమానాలు ఉన్న పంచాయతీల్లో ప్రత్యేక ఆడిట్ నిర్వహించి, తప్పులు జరిగినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే గ్రామాల్లో చేపడుతున్న కాంట్రాక్టు పనుల్లో నాణ్యతపై కూడా అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని డాక్టర్ బరిగెల శివ పేర్కొన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, సీసీ రోడ్లు, తాగునీటి పనులు, పారిశుద్ధ్య కార్యక్రమాలు తదితర అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేస్తున్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో పనుల నాణ్యతపై ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పనులు పూర్తయిన కొద్దికాలానికే దెబ్బతినడం, నాణ్యత లేని నిర్మాణాలు కనిపించడం వంటి ఫిర్యాదులు ఉంటే ఇంజినీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలని కోరారు. పనుల కొలతలు, బిల్లులు, నాణ్యత ప్రమాణాలు, పనుల వాస్తవ పరిస్థితిని పరిశీలించిన తర్వాతే చెల్లింపులు జరగాలని సూచించారు. గ్రామపంచాయతీలు ప్రజా సమస్యలను పరిష్కరించే వేదికలుగా ఉండాల్సిన చోట కొన్నిచోట్ల వ్యక్తిగత వివాదాలు, సెటిల్మెంట్లు, దందాలకు కేంద్రాలుగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని ఆయన అన్నారు. ప్రజల సమస్యలను చట్టబద్ధంగా పరిష్కరించాల్సిన బాధ్యత కలిగిన వ్యవస్థలు వ్యక్తిగత ప్రయోజనాలకు వేదికలుగా మారకూడదని పేర్కొన్నారు. గ్రామపంచాయతీ నాయకుల దౌర్జన్యాలు, బెదిరింపుల వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారనే ఫిర్యాదులను అధికారులు తీవ్రంగా పరిగణించాలని కోరారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమకు నచ్చిన ప్రజాప్రతినిధికి ఓటు వేసే హక్కు కలిగి ఉన్నారని, ఎన్నికల్లో ఎవరికి ఓటు వేశారనే విషయాన్ని ప్రస్తావిస్తూ ప్రజలను బెదిరించడం లేదా ప్రభుత్వ సేవల విషయంలో ఇబ్బందులకు గురిచేయడం సరికాదని డాక్టర్ బరిగెల శివ అన్నారు. ప్రజల ఓట్లతో పదవులు పొందిన వారు ప్రజలపై పెత్తనం చెలాయించకుండా ప్రజాసేవకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఐదేళ్ల పదవీకాలాన్ని ప్రజాసేవకు ఉపయోగించాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని, పదవిని పెట్టుబడిగా భావించి భారీగా సంపాదించాలనే ధోరణి ప్రజాస్వామ్య వ్యవస్థకు నష్టం కలిగిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు. గ్రామస్థాయి పాలనపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ మరింత పెరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. జిల్లా, మండల స్థాయి అధికారులు కార్యాలయాలకు మాత్రమే పరిమితం కాకుండా గ్రామాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకోవాలని కోరారు. గ్రామపంచాయతీల రికార్డులు, నిధుల వినియోగం, అభివృద్ధి పనులు, సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను కేవలం స్వీకరించి వదిలేయకుండా, వాటిపై విచారణ జరిపి తీసుకున్న చర్యలను ప్రజలకు తెలియజేయాలని అన్నారు. అర్బన్ ప్రాంతాల అభివృద్ధికే ప్రాధాన్యత ఇచ్చి గ్రామీణ ప్రాంతాలను నిర్లక్ష్యం చేయకూడదని డాక్టర్ బరిగెల శివ అన్నారు. గ్రామాల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, విద్య, ఆరోగ్యం వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని కోరారు. గ్రామాలు అభివృద్ధి చెందకుండా పట్టణ ప్రాంతాల అభివృద్ధి మాత్రమే జరిగితే సమగ్ర అభివృద్ధి సాధ్యం కాదని పేర్కొన్నారు. గ్రామీణ ప్రజలకు కూడా పట్టణ ప్రాంతాలతో సమానంగా ప్రభుత్వ సేవలు, మౌలిక సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీల్లో అవినీతి, అక్రమ వసూళ్లు, నిధుల దుర్వినియోగం, కాంట్రాక్టు పనుల్లో అవకతవకలు, ప్రజలను బెదిరించడం వంటి ఆరోపణలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని డాక్టర్ బరిగెల శివ కోరారు. ప్రజాధనం ప్రతి రూపాయి ప్రజల ప్రయోజనానికే వినియోగించబడేలా పారదర్శక వ్యవస్థను ఏర్పాటు చేయాలని, గ్రామస్థాయిలో జవాబుదారీతనం పెంచాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామపంచాయతీలు ప్రజలకు సేవలందించే కేంద్రాలుగా మారి, గ్రామాల అభివృద్ధికి నిజమైన వేదికలుగా పనిచేసేలా ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని డాక్టర్ బరిగెల శివ కోరారు.

**నిధుల దుర్వినియోగంపై నిఘా పెట్టండి..**

గ్రామపంచాయతీ కార్యాలయాల్లో వసూలు చేస్తున్న గ్రామస్థాయి పన్నులు.... అభివృద్ధి పనుల పేరు చెప్పుకొని క్షేత్రస్థాయి దుర్వినియోగం జరుగుతుందని పల్లెటూరు ప్రజలందరూ బాధ వ్యక్తం చేస్తుండగా గ్రామస్థాయిలో జరుగుతున్న గ్రామపంచాయతీ నిధుల దుర్వినియోగంపై ప్రభుత్వం ప్రభుత్వ అధికారులు క్షేత్రస్థాయి నిఘా పెట్టాలని కోరారు.గ్రామస్థాయి అధికారులైన సెక్రటరీలు విలేజ్ అసిస్టెంట్లు గ్రామ ప్రజలు చెల్లిస్తున్న పన్నుల చెల్లింపుపై కన్నువేస్తూ నిధుల దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు పెద్ద ఎత్తున అభియోగాలు వదంతులు వస్తుండగా గ్రామస్థాయి పాలనపై పై అధికారుల పర్యవేక్షణ పూర్తి స్థాయిలో లోపిస్తున్నందున నిధులు దుర్వినియోగంపై సరియైన ఆధారాలతో కూడిన లెక్కలు కనిపించకుండా పోతున్నాయని పల్లెటూరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు.గ్రామాలు అభివృద్ధి చెందాలంటే నిస్వార్థమైన ప్రజాసేవ అవసరమని వాటికి గ్రామస్థాయిలో కలెక్ట్ చేయబడుతున్న నిధులు నిష్పక్షపాతంగా గ్రామ అభివృద్ధి కొరకు వాడుకోవడంతోపాటు ప్రభుత్వం అందిస్తున్న గ్రామస్థాయి అభివృద్ధి నిధులను సద్వినియోగపరుచుకుంటూ ప్రజాసేవ పట్ల నిబద్ధతతో పనిచేయాలని అలాంటి సమర్థత కలిగిన గ్రామ సర్పంచులు వార్డు మెంబర్లు గ్రామ సెక్రటరీలు విలేజ్ అసిస్టెంట్లు ప్రతి మండలంలో,ప్రతి గ్రామంలో ప్రతి గ్రామంలో కొరవడినారని అందువల్లనే గ్రామస్థాయి అభివృద్ధి ఎక్కడ కనిపించకుండా పోతుంది అంటూ ప్రజల మనోవేదనను గుర్తు చేశారు.ప్రతి గ్రామంలో పట్టణ స్థాయిలాంటి సెటిల్మెంట్లకు పెద్ద ఎత్తున ప్రాధాన్యతనిస్తున్నారని నాయకుల చలామణి సర్పంచుల చలామణి ఎక్కువ అయిపోతుందని ప్రజల మనోభావాలతో పని లేకుండా డబ్బు సంపాదన కోసం సెటిల్మెంట్లకు ఎగబడుతున్నారని వాపోయారు.చెక్ పవర్ పెట్టుకొని నిధుల దుర్వినియోగానికి పాల్పడడం పట్ల,అభివృద్ధి పనుల పేరుమీద సెల్ఫ్ చెక్కులు ఉపయోగించకుండా జిల్లా గ్రామపంచాయతీ కార్యాలయ అధికారులు చొరవ తీసుకోవాలని గుర్తు చేశారు.గ్రామపంచాయతీ తీర్మానాలలో రాసుకుంటున్న అజెండాను పరిగణలోకి తీసుకొని అభివృద్ధి పనుల కోసం కేటాయిస్తున్న నిధులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని తెలియజేశారు.రాష్ట్ర అభివృద్ధి గ్రామస్థాయి నుండే మొదలవుతున్న సందర్భంలో గ్రామస్థాయి నాయకులు అందరూ ప్రజాసేవ కోసం కట్టుబడి ప్రజల అభివృద్ధి కోసం పని చేయాలని ప్రత్యేకించి తెలిపారు.గ్రామస్థాయిలో నిర్మించబడుతున్న ఇండ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వ అనుమతులతో పాటు అనధికార హోదాలో ప్రత్యేక వసూళ్లకు పాల్పడుతున్న గ్రామస్థాయి అధికారుల పట్ల కఠినమైన చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.రాష్ట్రంలో ఉన్న ప్రతి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పట్ల జిల్లా అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తూ నిర్వహించబడుతున్న సమీక్షలలో సమీకరించిన అభివృద్ధి పనులను పత్రిక ముఖంగా తెలియజేస్తూ గ్రామస్థాయి అభివృద్ధికి కట్టుబడి ఉండాలని కోరారు.జిల్లా కలెక్టర్లు సహృదయ భావంతో గ్రామస్థాయి అభివృద్ధికి నిధులను జిల్లా గ్రామపంచాయతీ కార్యాలయపు అధికారులచే ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరుపుతున్నప్పటికిని గ్రామాలలో జరుగుతున్న అవినీతిని,సర్పంచులు గ్రామస్థాయి అధికారులు కలిసి కొనసాగిస్తున్న దౌర్జన్యాలను నియంత్రించడంలోనూ పసిగట్టడంలోనూ పై అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారన్న నిందలు పెద్ద ఎత్తున వస్తున్నందున ప్రజల మనోభావాలకు అనుకూలంగా కలెక్టర్లు మంజూరు చేస్తున్న నిధులకు సరిసమానంగా గ్రామస్థాయి అభివృద్ధి జరిగి పట్టణ అభివృద్ధిని పరితపించే విధంగా ఉండాలని లేని పక్షంలో గ్రామస్థాయిలోనే ప్రభుత్వ పథకం మొదలై పట్టణ స్థాయి వరకు చేరిపోయే ఆస్కారం ఉందని తెలియజేశారు.

## మంజీరా రచయితల సంఘం 40 ఏళ్ల మహాసభ



**హైదరాబాద్(జై భీమ్ న్యూస్)**

బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో మంజీరా రచయితల సంఘం (మరస) 40 ఏళ్ల మహాసభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాసభలో ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యే మాణిక్ రావు, కవి, రచయిత నందిని సిద్దారెడ్డి, మాజీ చైర్మన్ దేవిప్రసాద్, విరహత్ అలీ, ఆంజన్న, శంకరం, మాజీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ల రామనరసింహ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే రాష్ట్రంలోని పలువురు రచయితలు, కవులు, కళాకారులు, సాహిత్యాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా మంజీరా రచయితల సంఘం నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్న సాహిత్య ప్రస్థానం, రచయితలు--కవుల సేవలు, సాహిత్య రంగం అభివృద్ధిపై పలువురు వక్తలు ప్రసంగించారు. 40 ఏళ్ల సాహిత్య ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ మహాసభలో సాహిత్య, సామాజిక అంశాలపై చర్చలు జరిగాయి.

## గాంధీ జయంతి వేళ కాంగ్రెస్, బీఆర్ఎస్‌పై బండి సంజయ్ ఫైర్

కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ శుక్రవారం గాంధీ జయంతి వేడుకల సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై విమర్శలు చేశారు. జమ్మికుంటలో మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. గాంధీ వారసత్వం తమదేనని చెప్పుకునే నైతిక అర్హత ఆ పార్టీలకు లేదని ఆయన విమర్శించారు. శ్రీరాముడిని "ధనికుల దేవుడు"గా అభివర్ణించిన కాంగ్రెస్ నేతల వ్యాఖ్యలపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. నిత్యం 'రామ' నామాన్ని జపించిన గాంధీ ఆరాధించిన రాముడు కేవలం ధనికులకే దేవుడా, లేక ప్రజలందరి దేవుడా? అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలను బండి సంజయ్ ప్రశ్నించారు. గాంధీజీ సత్యం, ధర్మం, న్యాయంతో కూడిన సనాతన ధర్మాన్ని పాటించారని ఆయన గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలు, అవినీతి, హిందూత్వ వ్యతిరేకత విధానాలతో నడిచే "ఇటలీ నేషనల్ కాంగ్రెస్" అని, దీనిని నడిపిస్తున్నది "డూప్లికేట్ గాంధీ కుటుంబం" అని ఆయన ఆరోపించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజల దృష్టిని మళ్లించేందుకే హిందూ సమాజాన్ని విభజించే కుట్రలు చేస్తోందని విమర్శించారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కూడా బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ఫామ్‌హౌస్‌కే పరిమితమై గాంధీ, అంబేద్కర్ వంటి జాతీయ నేతల జయంతి కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ఓటమి అనంతరం ప్రజా జీవితానికి దూరమైన కేసీఆర్ ప్రపంచంలోనే అత్యంత అహంకారపూరిత నాయకుడని దుయ్యబట్టారు. గాంధీ కలలు కన్న రామరాజ్యం, స్వచ్ఛ భారత్ వంటి ఆశయాలను ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నెరవేరుస్తోందని, గాంధీకి నిజమైన వారసులు తామేనని ఆయన పేర్కొన్నారు. త్వరలో జరగనున్న ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికను ప్రస్తావిస్తూ, ఈ ఎన్నిక రావడానికి కాంగ్రెస్ పార్టీయే కారణమని సంజయ్ ఆరోపించారు. ఆ నియోజకవర్గంలోని 2 లక్షల మంది హిందూ ఓటర్లను విస్మరించి, కేవలం 32 వేల ముస్లిం ఓట్లపైనే కాంగ్రెస్ ఆశలు పెట్టుకుందని విమర్శించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసినా ప్రజలు వారిని తిరస్కరిస్తారని, ఖైరతాబాద్‌లో హిందూ ఓటర్లను ఏకం చేసి బీజేపీని గెలిపిస్తామని ధీమా వ్యక్తం చేశారు. "డబుల్ ఇంజిన్" సర్కారుతోనే తెలంగాణ సమగ్రాభివృద్ధి సాధ్యమని ఆయన పునరుద్ఘాటించారు.

## రాష్ట్రంలో విద్యుత్ కొరత ఉండదు

**ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలు చేస్తున్నట్లు వెల్లడి**
**యాదాద్రి థర్మల్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో నడిపేందుకు ప్రయత్నాలు**
**విద్యుత్, కరవు పరిస్థితులపై మంత్రివర్గంలో సుదీర్ఘ చర్చ**
**కరవు పరిస్థితులపై ప్రతిపక్షాలు ఆనందపడుతున్నాయని విమర్శ**
**నల్గొండకు 5,000 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తానని హామీ**



తెలంగాణ రాష్ట్రంలో విద్యుత్ కొరత లేకుండా ప్రజలకు నిరంతరాయంగా సరఫరా అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి భరోసా ఇచ్చారు. కరెంట్ కష్టాలు తలెత్తకుండా ప్రభుత్వం అప్రమత్తంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్న అనంతరం నల్గొండలోని తన క్యాంప్ కార్యాలయంలో మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పటికీ, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఇతర రాష్ట్రాల నుంచి 19,000 మెగావాట్లకు పైగా విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో సుమారు ఐదు గంటల పాటు విద్యుత్, కరవు పరిస్థితులపైనే కూలంకషంగా చర్చించినట్లు తెలిపారు. గతంలో తాను సబ్‌స్టేషన్లలోని లాగ్‌బుక్‌లను తనిఖీ చేసినప్పుడు, కొందరు ఆపరేటర్లు విద్యుత్ సరఫరాలో జరుగుతున్న వ్యత్యాసాలను అంగీకరించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి తెలిపారు. సింగరేణి బొగ్గు లింకేజీ, నైనీ బ్లాక్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, బొగ్గు సరఫరాను పునరుద్ధరించేలా ప్రత్యేక దృష్టి సారించమన్నారు. నల్గొండ నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ద్వారా నియోజకవర్గానికి 5,000 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలో కరవు పరిస్థితులు నెలకొనడంపై ప్రతిపక్షాలు రాజకీయానందం వ్యక్తం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులే విజయం సాధిస్తారని కోమటిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

# స్టేటస్‌లు పెరుగుతున్నాయి.. అనుబంధాలు తగ్గుతున్నాయి

**మొబైల్, సోషల్ మీడియా వినియోగంతో మారుతున్న జీవనశైలి**

**కుటుంబ సభ్యులు, బంధువులతో తగ్గుతున్న ఆత్మీయ సమయం**

**వేలాది కాంటాక్ట్స్, ఫాలోవర్స్ ఉన్నా ఆపదలో అండగా నిలిచేది ఎందరు?**

**సాంకేతికతతో పాటు నిజమైన అనుబంధాలకూ ప్రాధాన్యం అవసరం**

**కష్ట సమయంలో తోడుండే మనిషే జీవితంలో గొప్ప సంపద**

**హైదరాబాద్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్):**

ప్రస్తుత ఆధునిక జీవనశైలిలో మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా వినియోగం విపరీతంగా పెరిగిపోతుండగా.. మరోవైపు మానవ సంబంధాలు, ఆప్యాయతలు, అనుబంధాలు క్రమంగా తగ్గిపోతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఒకప్పుడు కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి మాట్లాడుకుంటూ, కష్టసుఖాలను పంచుకుంటూ గడిపిన సమయం ఇప్పుడు మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియా కారణంగా తగ్గిపోతోంది. ఫోన్‌లో వెయ్యి కాంటాక్ట్స్ ఉండొచ్చు.. వందల మంది ఫ్రెండ్స్ ఉండొచ్చు.. వేల మంది ఫాలోవర్స్ ఉండొచ్చు.. కానీ అర్ధరాత్రి ఆపద వచ్చినప్పుడు "నేనున్నాను" అంటూ భరోసా ఇచ్చే మనుషులు ఎంతమంది ఉన్నారనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన ప్రశ్నగా మారింది. ప్రస్తుతం మనిషి జీవితంలో సంపాదన, ఉద్యోగం, మంచి జీతం, సొంత ఇల్లు, కారు వంటి సౌకర్యాలకు ప్రాధాన్యత పెరిగింది. అయితే అదే సమయంలో మనల్ని నిజంగా ప్రేమించే, మన కష్టాలను అర్థం చేసుకునే, అవసరమైన సమయంలో మన వెంట నిలిచే మనుషులతో గడిపే సమయం తగ్గిపోతోంది. ఒకే ఇంట్లో నివసిస్తున్న కుటుంబ సభ్యుల మధ్య కూడా మొబైల్ ఫోన్ల కారణంగా మాటలు తగ్గిపోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. చేతిలో ఫోన్ ఉన్నా.. పక్కనే ఉన్న మనిషితో మాట్లాడేందుకు సమయం లేకపోవడం నేటి సమాజంలో ఆలోచించాల్సిన అంశంగా మారింది. సోషల్ మీడియాలో ఒక స్టేటస్ పెట్టగానే వందలాది మంది చూసే అవకాశం ఉంది. ఒక పోస్టుకు లైకులు, కామెంట్లు, షేర్లు రావచ్చు. వేలాది మంది ఫాలోవర్స్ ఉండవచ్చు. కానీ మన బాధను తెలుసుకుని పలకరించే వ్యక్తి, మన కష్టాన్ని తన కష్టంగా భావించే వ్యక్తి, ఆపదలో మన పక్కన నిలబడే వ్యక్తి విలువ మాత్రం వీటన్నింటికంటే ఎంతో ఎక్కువ. సోషల్ మీడియా పరిచయాలు పెరుగుతున్నప్పటికీ నిజమైన అనుబంధాలు తగ్గిపోతున్నాయా అనే ప్రశ్న ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. జీవితంలో ఎంత సంపాదించామన్నది మాత్రమే ముఖ్యం కాదు.. మన ప్రయాణంలో మనతో పాటు ఎంతమంది నిజమైన మనుషులు ఉన్నారన్నదే ముఖ్యమనే భావన వ్యక్తమవుతోంది. సాంకేతికత మనిషి జీవితాన్ని సులభతరం చేయడానికి ఉపయోగపడాలి కానీ.. అదే సాంకేతికత కారణంగా కుటుంబ సంబంధాలు, స్నేహాలు, బంధుత్వాలు దూరం కాకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త పడాల్సిన అవసరం ఉంది. ఫోన్‌లో కాంటాక్ట్స్ సంఖ్య పెరగడం కంటే.. జీవితంలో నిజమైన అనుబంధాలు పెరగాలి. ఫాలోవర్స్ సంఖ్య పెరగడం కంటే.. కష్ట సమయంలో అండగా నిలిచే మనుషులు పెరగాలి. ఎందుకంటే అర్ధరాత్రి ఆపద వచ్చినప్పుడు "నేనున్నాను" అని చెప్పే ఒక్క మనిషి ఉండటం కూడా జీవితంలో సంపాదించిన గొప్ప సంపదే.




# ఇల్లంద గ్రామ సర్పంచ్‌కు షోకాజ్ నోటీసులు

**రూ.13 లక్షల నిధులపై 7 రోజుల్లో వివరణ ఇవ్వాలని డీపీఓ ఆదేశం**




**వరంగల్(జై భీమ్ న్యూస్)**

వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామపంచాయతీలో నిధుల వినియోగం, ఏకపక్ష నిర్ణయాలపై గ్రామ వార్డు సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు తనిఖీలు చేపట్టారు. గ్రామపంచాయతీకి సంబంధించిన రికార్డులను స్వాధీనం చేసుకుని పంచాయతీ అధికారులు పరిశీలించారు. రికార్డుల తనిఖీల సందర్భంగా సుమారు రూ.13 లక్షల నిధులకు సంబంధించి తగిన తీర్మానాలు, ఎం.బీ. రికార్డులు, అంచనా ప్రతిపాదనలు (ఎస్టిమేట్స్), బిల్లులు లేవని అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై అధికారులు వివరణ కోరారు. ఇల్లంద గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శులకు రూ.13 లక్షల నిధుల డ్రాపై 7 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి కల్పన తెలిపారు. నిర్దేశిత గడువులోగా వివరణ సమర్పించాలని అధికారులు ఆదేశించారు. సంబంధిత రికార్డులు, నిధుల వినియోగానికి సంబంధించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు.

# పింగిళి కళాశాలలో ఘనంగా గాంధీ జయంతి వేడుకలు

**సత్యం, అహింస మార్గాలను ఆచరించాలి: ప్రిన్సిపల్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి**






**హన్మకొండ, అక్టోబర్ 2 (జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (స్వయం ప్రతిపత్తి)లో శుక్రవారం గాంధీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, మైభారత్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ లెఫ్టినెంట్ ప్రొఫెసర్ బి. చంద్రమౌళి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ప్రిన్సిపల్ అనంతరం మాట్లాడుతూ.. భారతదేశ స్వాతంత్ర్య సమరంలో గాంధీజీ సత్యం, అహింస అనే రెండు బలమైన ఆయుధాలతో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడారని తెలిపారు. దండి యాత్ర, క్విట్ ఇండియా ఉద్యమం వంటి అనేక ఉద్యమాలకు ఆయన నాయకత్వం వహించారని గుర్తుచేశారు. కులమత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ సమానమేనని గాంధీజీ చాటి చెప్పారని, ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మైభారత్ హనుమకొండ జిల్లా యువజన అధికారి సంజీవ్ భూక్య మాట్లాడుతూ.. గాంధీజీ ఖాదీ వస్త్రాలను ధరించడంతో పాటు స్వదేశీ వస్తువులను వినియోగించాలని ప్రజలకు పిలుపునిచ్చారని తెలిపారు. ఆయన చూపిన సత్యం, పరిశుభ్రత మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని సూచించారు. స్వచ్ఛతను జీవితంలో భాగంగా చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ రామా రత్నమాల మాట్లాడుతూ.. అక్టోబర్ 2వ తేదీని ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. గాంధీజీ ఆశయాలను స్మరించుకుంటూ ప్రతి ఒక్కరూ శాంతి మార్గంలో నడవాలని సూచించారు. దేశం కోసం గాంధీజీ చేసిన త్యాగం చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ వి. మమత, అధ్యాపకులు డాక్టర్ రామకృష్ణ రెడ్డి, రమేష్, డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్, మైభారత్ వాలంటీర్లు, ఎన్‌సీసీ కేడెట్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాకతీయ విశ్వవిద్యాలయంలో ఉచిత కోచింగ్..

**'ఇండియన్ పాలిటీ'పై ప్రత్యేక శిక్షణ**





**హన్మకొండ, అక్టోబర్ 2 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్ ఆధ్వర్యంలో పోటీ పరీక్షల అభ్యర్థుల కోసం నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 'ఇండియన్ పాలిటీ' అంశంపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి పాలమూరు విశ్వవిద్యాలయం యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ లా ప్రిన్సిపాల్ డాక్టర్ భూమయ్య ముఖ్య అతిథిగా, వక్తగా హాజరై అభ్యర్థులకు మార్గదర్శనం చేశారు. కాకతీయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం ప్రత్యేక ఆదేశాలు, ప్రోత్సాహంతో ఈ శిక్షణా తరగతులు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనసాగిన శిక్షణలో డాక్టర్ భూమయ్య భారత రాజ్యాంగం, ఇండియన్ పాలిటీకి సంబంధించిన కీలక అంశాలను అభ్యర్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో వివరించారు. భారత రాజ్యాంగ విశిష్టతలు, ప్రవేశిక, ప్రాథమిక హక్కులు, ప్రాథమిక విధులు, ఆదేశిక సూత్రాలు, కేంద్ర--రాష్ట్ర సంబంధాలు, రాజ్యాంగ షెడ్యూళ్లు, రాజ్యాంగ సవరణలు తదితర అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. పోటీ పరీక్షల దృష్ట్యా ఆయా అంశాలను ఎలా అధ్యయనం చేయాలి, ముఖ్యమైన అంశాలను ఎలా గుర్తించాలి, పునశ్చరణను ఏ విధంగా చేపట్టాలి అనే విషయాలపై కూడా అభ్యర్థులకు పలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ భూమయ్య మాట్లాడుతూ పోటీ పరీక్షల్లో 'ఇండియన్ పాలిటీ' అత్యంత కీలకమైన అంశమని తెలిపారు. సరైన ప్రణాళికతో అధ్యయనం చేసి, క్రమం తప్పకుండా పునశ్చరణ చేస్తే ఈ విభాగంలో మంచి మార్కులు సాధించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు భారత రాజ్యాంగ అంశాలపై స్పష్టమైన అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. సివిల్స్, గ్రూప్స్, పోలీస్ కానిస్టేబుల్, ఎస్ఐ తదితర పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న పెద్ద సంఖ్యలో అభ్యర్థులు శిక్షణ తరగతులకు హాజరై, తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రోజంతా అభ్యర్థులకు సమయాన్ని కేటాయించి నాణ్యమైన శిక్షణ అందించిన డాక్టర్ భూమయ్యకు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్టడీస్ సెంటర్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గాంధీజీ ఆశయాలను కొనసాగించడమే ఘన నివాళి - డాక్టర్ అనితా రెడ్డి




**హన్మకొండ, అక్టోబర్ 2 (జై భీమ్ న్యూస్)**

జాతిపిత మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి, సేవా మార్గాలను కొనసాగించడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని అనురాగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల, బధిరుల ఆశ్రమంలో జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అనితా రెడ్డి హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. గాంధీజీ పాటించిన సత్యం, అహింస, శాంతి, సేవా సిద్ధాంతాలు నేటి సమాజానికి ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీజీ చూపిన మంచి మార్గంలో నడుస్తూ, మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గాంధీజీ ఆశయాలను ఆచరణలో పెట్టి ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు. అనంతరం ఆశ్రమంలోని పిల్లలకు డాక్టర్ అనితా రెడ్డి అల్పాహారం అందించారు. పిల్లలతో కొంతసేపు ఆప్యాయంగా గడిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు సుచరిత, రాజేందర్ రెడ్డి, భార్గవి, రాఘవ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచం గర్వించదగ్గ నేత మహాత్మా గాంధీ

**గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి ఆదర్శాలను నేటి తరం కొనసాగించాలి: కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం**




**హన్మకొండ, అక్టోబర్ 2 (జై భీమ్ న్యూస్)**

మహాత్మా మోహన్ దాస్ కరంచంద్ గాంధీ ప్రపంచం గర్వించదగ్గ మహోన్నత నేత అని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం అన్నారు. మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్‌బహదూర్ శాస్త్రి జయంతిని పురస్కరించుకుని కాకతీయ విశ్వవిద్యాలయం పరిపాలన భవన ప్రాంగణంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ఆచార్య వి. రామచంద్రం గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి దేశానికి అందించిన సేవలు, చూపిన ఆదర్శాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. వారి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. గాంధీజీ చూపిన అహింసా మార్గం బలహీనతకు సంకేతం కాదని, అది ఒక శక్తివంతమైన ఆయుధమని పేర్కొన్నారు. దేశం కోసం జీవితాలను అంకితం చేసిన మహనీయులను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత అని అన్నారు. మహాత్మా గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి వంటి మహనీయులను స్మరించుకునే ఈ రోజు ప్రతి భారతీయుడు గర్వించదగ్గ రోజని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి, ఆచార్య పి. మల్లారెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల, ఆచార్య నరసింహాచారి, ఆచార్య గాదె సమ్మయ్య, డాక్టర్ ఎస్. మల్లేశ్వర్, డాక్టర్ టి. శాస్త్రి, డాక్టర్ పి. శ్రీనివాస్, పి. రవి తదితరులు పాల్గొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయ ప్రజా సంబంధాల అధికారి డాక్టర్ పృథ్వీరాజ్ వల్లాల కార్యక్రమ సమన్వయకర్తగా వ్యవహరించారు.

# బి.ఫార్మసీలో 8 ఖాళీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు

**అక్టోబర్ 5న కాకతీయ విశ్వవిద్యాలయంలో కౌన్సెలింగ్**

**హన్మకొండ, అక్టోబర్ 2 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ ఎంసెట్ బి--2026 కన్వీనర్ జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో బి.ఫార్మసీ కోర్సులో మిగిలి ఉన్న 8 ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 5వ తేదీన స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, విభాగాధిపతి ప్రొఫెసర్ జె. కృష్ణవేణి తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు అక్టోబర్ 5, 2026న కళాశాలలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు అవసరమైన అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు స్పాట్ అడ్మిషన్ ఫీజుతో హాజరుకావాలని సూచించారు. అర్హత సాధించిన అభ్యర్థులు స్పాట్ అడ్మిషన్ ఫీజుగా రూ.1,300, అర్హత సాధించని అభ్యర్థులు రూ.2,100 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. బి.ఫార్మసీ కోర్సుకు సంబంధించిన ట్యూషన్ ఫీజు రూ.45,000గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. అయితే స్పాట్ అడ్మిషన్ ద్వారా బి.ఫార్మసీ కోర్సులో ప్రవేశం పొందే విద్యార్థులు ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్ లేదా స్కాలర్‌షిప్‌కు అర్హులు కారని కళాశాల ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. కాబట్టి అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత తేదీన ఒరిజినల్ ధ్రువపత్రాలు, అవసరమైన ఫీజుతో హాజరై స్పాట్ అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని ప్రొ. జె. కృష్ణవేణి సూచించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE

# ఘనంగా గాంధీ జయంతి వేడుకలు



**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**

హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,హనుమకొండ డీసీసీ అధ్యక్షులు ఇనగాల వెంకటరామిరెడ్డిలతో కలిసి వరంగల్ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు మోహన్ గౌడ్ లు గాంధీజీ ఫోటోకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడారు.గాంధీజీ దేశ స్వాతంత్ర్యం కోసం చేసిన పోరాటాన్ని, ఆయన అనుసరించిన అహింస, సత్యం, శాంతి, స్వచ్ఛత వంటి విలువల ను పలువురు గుర్తు చేసుకున్నారు. ప్రజలందరూ గాంధీజీ ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్, వికలాంగుల చైర్మన్ అజీజ్ ఖాన్తో పాటు కాంగ్రెస్ సేవాదళ్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీజీకి వరంగల్ పోలీస్ కమిషనర్ ఘన నివాళి





**వరంగల్, అక్టోబర్ 2 (జై భీమ్ న్యూస్)**

జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో గాంధీజీ చిత్రపటానికి వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా కమిషనర్ ఎన్. శ్వేత మాట్లాడుతూ, మహాత్మా గాంధీజీ చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీస్ శాఖ నిబద్ధతతో పనిచేస్తోందని తెలిపారు. ప్రజలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా పోలీస్ అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, అడిషనల్ డీసీపీ (అడ్మినిస్ట్రేషన్) రాయల ప్రభాకర్ రావు, ఇతర అడిషనల్ డీసీపీలు, ఏసీపీలు, ఏఆర్, సివిల్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొని మహాత్మా గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు.

## బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించడమే గాంధీజీకి నిజమైన నివాళి

**మడికొండ, అక్టోబర్ 2(జై భీమ్ న్యూస్)**

సత్యం, అహింస, శాంతి, సత్యాగ్రహం వంటి మహోన్నత సిద్ధాంతాలతో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి దిశానిర్దేశం చేసిన జాతిపిత మహాత్మా గాంధీజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరించాలని వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఏసీపీ డి. రమణబాబు పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీజీ 157వ జయంతి సందర్భంగా మడికొండలోని కమిషనరేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో గాంధీజీ విగ్రహానికి ఆయన పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ డి. రమణబాబు మాట్లాడుతూ గాంధీజీ దేశ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. గాంధీజీ జీవితం సత్యం, నైతిక విలువలు, నిరాడంబరత, మానవతా విలువలకు ప్రతీకగా నిలిచిందని పేర్కొన్నారు. గాంధీజీ నమ్మిన అహింసా సిద్ధాంత స్ఫూర్తితో సమాజంలో శాంతి, సామరస్యం, సోదరభావం, పరస్పర గౌరవాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. వ్యక్తిగత జీవితంలో క్రమశిక్షణ, నిజాయితీ, నైతిక విలువలను పాటించడంతో పాటు సమాజం పట్ల బాధ్యతాయుతమైన పౌరులుగా వ్యవహరించడమే మహాత్మా గాంధీజీకి అందించే నిజమైన నివాళి అని ఏసీపీ రమణబాబు అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐ కె. సూర్యప్రకాశ్, 5వ బెటాలియన్ ఆర్ఐతో పాటు సివిల్, 5వ బెటాలియన్ పోలీసు సిబ్బంది పాల్గొని జాతిపిత మహాత్మా గాంధీజీకి ఘనంగా నివాళులర్పించారు.



# ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహార పథకం..





**కేంద్ర వంటశాలల ఏర్పాటుకు రూ.9.17 కోట్ల విరాళం**
**నవంబర్ 30లోగా వంటశాలల పనులు పూర్తి చేయాలి..**
**డిసెంబర్ 9న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించాలి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైద్రాబాద్, 2 అక్టోబర్ 2026(జై భీమ్ న్యూస్)**

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించే కార్యక్రమాన్ని మరింత విస్తృతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్, వికారాబాద్ జిల్లాల్లో ఆధునిక కేంద్రీకృత సామాజిక వంటశాలల ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థలు హరే కృష్ణ ఫౌండేషన్‌కు ఆర్థిక సహకారం అందించేందుకు ఒప్పందం చేసుకున్నాయి. జూబ్లీహిల్స్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధులు, జున్నా సోలార్ సిస్టమ్స్, చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థల ప్రతినిధులు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్‌లో ఆధునిక కేంద్రీకృత సామాజిక వంటశాల ఏర్పాటుకు జున్నా సోలార్ సిస్టమ్స్ సంస్థ సీఎండీ శేఖర్ రెడ్డి, సీఈఓ అనిల్ బాబు కలిసి రూ.5.17 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి చేతుల మీదుగా హరే కృష్ణ ఫౌండేషన్‌కు అందించారు. అలాగే వికారాబాద్‌లో కేంద్రీకృత సామాజిక వంటశాల నిర్మాణానికి చైన్ ల్యాబ్స్ ఇండియా సంస్థ ప్రతినిధి డి. సుమంత్, వైస్ ప్రెసిడెంట్ బుగత సంతోష్ కుమార్ కలిసి రూ.4 కోట్ల చెక్కును అందించారు. దీంతో రెండు సంస్థల నుంచి కలిపి మొత్తం రూ.9.17 కోట్ల ఆర్థిక సహకారం అందింది. ఈ సందర్భంగా మంచి కార్యక్రమానికి నిధులు అందించి సహకరించేందుకు ముందుకు వచ్చిన సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పోషక విలువలతో కూడిన అల్పాహారం అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. కేంద్రీకృత వంటశాలల ఏర్పాటుకు సంబంధించిన పనులను నవంబర్ 30వ తేదీలోగా పూర్తి చేసి, డిసెంబర్ 9వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి ప్రారంభించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కేంద్రీకృత వంటశాలలను విద్యార్థులు సందర్శించేలా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల శారీరక ఎదుగుదల, విద్యా పురోగతి తదితర అంశాలను ఎప్పటికప్పుడు నమోదు చేసేలా విద్యార్థుల ప్రగతి వివరాలను నిర్వహించాలని ముఖ్యమంత్రి సూచించారు. విద్యార్థులకు అందించే ఆహారంలో ఉండే కేలరీలను లెక్కించేందుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం, యాప్‌లను వినియోగించాలని తెలిపారు. అల్పాహారం అందించడం వల్ల విద్యార్థులు సమయానికి పాఠశాలలకు చేరుకునేలా ప్రోత్సాహం లభిస్తుందని, విద్యార్థులకు అందించే ఆహార నాణ్యతపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని సీఎం పేర్కొన్నారు. ఆహార తయారీలో పరిశుభ్రత, నాణ్యత, పోషక విలువలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. అలాగే ప్రాంతాల వారీగా స్థానిక ఆహారపు అలవాట్లకు అనుగుణంగా విద్యార్థులకు అల్పాహారం అందించేలా మెనూను రూపొందించాలని చెప్పారు. జీవితకాలం కొనసాగించాల్సిన కార్యక్రమంగా దీనిని పరిగణించి కేంద్రీకృత వంటశాలలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేసి నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, హరే కృష్ణ ఫౌండేషన్ ప్రతినిధి సత్య గౌర చంద్ర దాస్ స్వామీజీతో పాటు ఆయా సంస్థల ప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఇద్దరు పాక్ చొరబాటుదారులు హతం

**పంజాబ్ సరిహద్దులో ఘటన**
**ఖల్రా సెక్టార్‌లో చొరబాటు యత్నం**
**ముగ్గురు వ్యక్తుల కదలికలు గుర్తింపు**
**హెచ్చరికలు బేఖాతరు చేయడంతో కాల్పులు**
**మరో వ్యక్తి పాక్ వైపు పరార్**

పంజాబ్‌లోని అంతర్జాతీయ సరిహద్దు వెంబడి భారత్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు ప్రయత్నించిన ఇద్దరు పాకిస్థానీ చొరబాటుదారులను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) కాల్చి చంపింది. టార్న్ టారన్ జిల్లాలోని ఖల్రా సెక్టార్ పరిధిలో రాజోకే బోర్డర్ అవుట్‌పోస్ట్ (బీఓపీ) సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పాకిస్థాన్ వైపు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా భారత భూభాగం వైపు వస్తుండటాన్ని బీఎస్ఎఫ్ సిబ్బంది గుర్తించి అప్రమత్తమయ్యారు. ముందుకు రావద్దని పలుమార్లు హెచ్చరించినప్పటికీ వారు పట్టించుకోకుండా భారత భూభాగం వైపు కదలడంతో బీఎస్ఎఫ్ దళాలు కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో వ్యక్తి పాకిస్థాన్ వైపు తిరిగి పారిపోయినట్లు అధికారులు తెలిపారు. మృతుల వివరాలు, గుర్తింపు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పంజాబ్ పోలీసులకు అప్పగించినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై స్థానిక పోలీసులతో కలిసి బీఎస్ఎఫ్ అధికారులు దర్యాప్తు చేపట్టగా, ఘటనా స్థలంలో సోదాలు కొనసాగుతున్నాయి.

# దాల్ మఖనీకి విస్కీ తాళింపు

**హైదరాబాద్‌లో వైరల్‌గా మారిన 'దాల్ విస్కీ' వంటకం**
**సోషల్ మీడియాలో వీడియోపై మిశ్రమ స్పందన**

**హైద్రాబాద్, 2 అక్టోబర్ 2026(జై భీమ్ న్యూస్)**

సోషల్ మీడియాలో ఎప్పుడు ఏది ట్రెండ్ అవుతుందో చెప్పడం కష్టం. ముఖ్యంగా ఫుడ్ విషయంలో రోజూ కొత్తకొత్త ప్రయోగాలు పుట్టుకొస్తూనే ఉంటాయి. తాజాగా, హైదరాబాద్‌లోని ఓ రెస్టారెంట్ అందిస్తున్న 'దాల్ విస్కీ' అనే వినూత్న వంటకం నెట్టింట హల్‌చల్ చేస్తోంది. సంప్రదాయ ఉత్తర భారత వంటకమైన దాల్ మఖనీకి విస్కీ ఫ్లేవర్‌ను జోడించి అందిస్తున్న ఈ డిష్ ఇప్పుడు ఫుడ్ లవర్స్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. హైదరాబాద్‌లోని 'విస్కీ సాంబ' అనే రెస్టారెంట్‌లో ఈ ప్రత్యేకమైన వంటకాన్ని సర్వ్ చేస్తున్నారు. అందరికీ సుపరిచితమైన దాల్ మఖనీని తయారు చేసి, కస్టమర్ల టేబుల్ వద్దకే తీసుకొచ్చి, దానికి ప్రత్యక్షంగా తాళింపు పెడతారు. బాగా వేడి చేసిన స్వచ్ఛమైన నెయ్యిలో ఎండు మిరపకాయలు వేసి, ఆపై రెస్టారెంట్ సిగ్నేచర్ విస్కీని కొద్దిగా పోస్తారు. దీంతో ఒక్కసారిగా మంటలు (ఫ్లాంబే) చెలరేగుతాయి. మంటలతో కూడిన ఆ తాళింపును నేరుగా దాల్ మఖనీపై పోస్తారు. ఈ మొత్తం ప్రక్రియను కస్టమర్లు ప్రత్యక్షంగా చూడవచ్చు. అనంతరం వేడివేడిగా కుల్చాతో దీనిని అందిస్తారు. ఈ వంటకం తయారీకి సంబంధించిన వీడియోను కొందరు కంటెంట్ క్రియేటర్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో ఇది క్షణాల్లో వైరల్‌గా మారింది. దీనిపై నెటిజన్ల నుంచి మిశ్రమ స్పందన వ్యక్తమవుతోంది. కొంతమంది ఈ సృజనాత్మకతను మెచ్చుకుంటూ, "చాలా ఆసక్తికరంగా ఉంది", "ఈ అనుభవం అద్భుతం" అని కామెంట్లు పెడుతున్నారు. "మన భారతీయుల క్రియేటివిటీ మామూలుగా ఉండదు" అని మరికొందరు ప్రశంసించారు. అయితే, ఈ ప్రయోగాన్ని అందరూ స్వాగతించడం లేదు. "ఆ కొద్దిపాటి విస్కీని పప్పులో వేయడం కంటే తాగడమే మేలు" అని ఒకరు వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. "విస్కీ కలపడం వల్ల అసలైన దాల్ మఖనీ రుచి పాడైపోదా?" అని మరో ఫుడ్ లవర్ ఆందోళన వ్యక్తం చేశారు. మొత్తం మీద, ఒక సంప్రదాయ వంటకానికి ఆధునిక హంగులు, ముఖ్యంగా విస్కీ వంటి ఆల్కహాల్‌ను జోడించడం ఫుడ్ సర్కిల్స్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ ఫ్యూజన్ వంటకం కొందరికి నచ్చుతున్నా, మరికొందరిని ఆశ్చర్యపరుస్తోంది.

# తప్పిపోయిన వ్యక్తిని గుర్తించి కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించిన రైల్వే పోలీసులు




**కాజీపేట, 2 అక్టోబర్ 2026 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వకుండా రైలు ఎక్కి వెళ్లిపోయిన మతి స్థిమితం సరిగా లేని వ్యక్తిని రైల్వే పోలీసులు చాకచక్యంగా గుర్తించి, సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. గుంటూరుకు చెందిన బొల్లపల్లి సుకుమార్ (50) బెల్లంపల్లిలోని ఓ చర్చికి వచ్చారు. అనంతరం కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా మంచిర్యాల రైల్వే స్టేషన్‌లో బీదర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి వెళ్లిపోయారు. సుకుమార్ కనిపించకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు మంచిర్యాల రైల్వే పోలీసులను సంప్రదించారు. దీంతో మంచిర్యాల రైల్వే పోలీసులు వెంటనే కాజీపేట రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న కాజీపేట రైల్వే పోలీసు అధికారి శ్రీ అభినవ్ సూచనల మేరకు విధుల్లో ఉన్న హెడ్ రైల్వే కానిస్టేబుల్ ఓంకార్, రైల్వే పోలీసు కానిస్టేబుళ్లు అశోక్, కోటేష్ అప్రమత్తమయ్యారు. రైలు నంబర్ 17012 బీదర్ ఎక్స్‌ప్రెస్‌లోని అన్ని బోగీలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తూ సుకుమార్ కోసం గాలించారు. ఈ క్రమంలో సుకుమార్‌ను గుర్తించిన పోలీసులు ఆయనను సురక్షితంగా కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. అనంతరం ఆయనకు అన్నపానీయాలు అందించి, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల సమాచారం మేరకు సుకుమార్ కుమారుడు ప్రవీణ్ కుటుంబ సభ్యులతో కలిసి కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. అనంతరం పోలీసులు సుకుమార్‌ను కుటుంబ సభ్యులకు సురక్షితంగా అప్పగించారు. తప్పిపోయిన తన తండ్రి క్షేమంగా లభించడంతో ప్రవీణ్‌తో పాటు కుటుంబ సభ్యులు కాజీపేట రైల్వే పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాజీపేట రైల్వే పోలీసు అధికారి అభినవ్ మాట్లాడుతూ, "ప్రయాణికుల రక్షణే మా ప్రధాన కర్తవ్యం. ప్రయాణికులు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా వారి భద్రత కోసం రైల్వే పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటారు. అవసరమైన సమయంలో ప్రయాణికులకు తక్షణ సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని తెలిపారు. తప్పిపోయిన వ్యక్తిని సకాలంలో గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించడంలో చాకచక్యంగా వ్యవహరించిన రైల్వే పోలీసులను పలువురు అభినందించారు.

# ప్రభుత్వానికి ఏపీ ఎన్జీవోల కృతజ్ఞతలు

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకున్న చర్యలపై ఏపీ ఎన్జీవో సంఘం హర్షం వ్యక్తం చేసింది. కేవలం 25 రోజుల్లోనే కీలక హామీలను నెరవేరుస్తూ ఉత్తర్వులు జారీ చేయడం పట్ల ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఏపీ ఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆలపర్తి విద్యాసాగర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలతో కలిపి రెండు డీఏలను ప్రభుత్వం చెల్లించిందని గుర్తుచేశారు. 12వ పీఆర్సీ కమిటీ చైర్మన్‌గా మాజీ సీఎస్ దినేశ్ కుమార్‌ను నియమించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ అమలు చేయడం, పెన్షనర్లకు డిసెంబర్ 1 నుంచి అదనపు క్వాంటమ్ పెన్షన్ వర్తింపజేయడం సంతోషకరమని అన్నారు. ఆరోగ్య కార్డుల సమస్య పరిష్కారానికి నెలకు రూ.36 కోట్ల నుంచి రూ.40 కోట్లు నేరుగా ట్రస్ట్‌కు జమ అయ్యేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విద్యాసాగర్ వివరించారు. ఆరోగ్య కార్డు నిధులు నేరుగా ట్రస్ట్‌కు వెళ్లేలా చర్యలు తీసుకోవడం గత పదేళ్లలో ఇదే తొలిసారని ఆయన పేర్కొన్నారు. ఉద్యోగుల డిమాండ్ల పట్ల సానుకూలంగా వ్యవహరిస్తున్న ప్రభుత్వానికి ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు మెరుగైన, నగదు రహిత వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపడుతోందని ఆయన తెలిపారు.